

గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోండి: ఎస్పీ

నరసన్నపేట, జూలై 27: గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. శనివారం రాత్రి నరసన్నపేట పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీశారు. గంజాయి విక్రయించే వారి వివరాలను తెలుసుకోవాలని, రాత్రి సమయంలో చోరీలు జరగకుండా పెట్రోలింగ్ పెంచాలని ఎస్పీ సూచించారు. పేకాట, జూదం, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని, ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని తెలిపారు. ఎస్పీ వెంట సీఐ ప్రసాదరావు, ఎస్ఐ అశోక్‌బాబు, ఏఎస్ఐ కాంతారావు, ఆసిరినాయుడు తదితరులు ఉన్నారు.

ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎవరు

- నియోజకవర్గంలో సమన్వయం కరువు
- అయోమయంలో తెలుగుదేశం పార్టీ కేడర్
- అధినాయకత్వం దృష్టి సారించాలని వినతి





(రణస్థలం)

తెలుగుదేశం పార్టీది చెక్కుచెదరని బలం. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూసింది. ఎన్నో సంక్షోభాలను అధిగమించింది. క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి ఉన్న బలం అటువంటిది. ఎంత బలమైన పార్టీకైనా నడిపించే నాయకత్వం ముఖ్యం. సమన్వయం చేయడం కీలకం. ఈ లోటు ఎచ్చెర్ల నియోజకవర్గంలో స్పష్టంగా కనిపిస్తోంది. అక్కడ పార్టీ ఇన్‌చార్జి అంటూ ఎవరూ లేకపోవడమే అందుకు కారణం. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో అన్ని స్థానాలను టీడీపీ కూటమి కైవసం చేసుకుంది. అత్యధిక మెజార్టీతో కూటమి అభ్యర్థులు గెలిచారు. ఎచ్చెర్లలో కూటమి తరఫున పోటీచేసిన బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు ఘన విజయం సాధించారు. టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు సమన్వయంతో వ్యవహరించడంతో ఆయన గెలుపు సునాయాసం అయ్యింది. అయితే కూటమిపరంగా బీజేపీకి ఎమ్మెల్యే ఈశ్వరరావు ఉన్నారు. జనసేనకు సైతం నిర్దిష్ట నాయకత్వం ఉంది. కానీ తెలుగుదేశం పార్టీకి మాత్రం ఇంతవరకూ ఇన్‌చార్జి లేరు. దీంతో పార్టీపరంగా కార్యక్రమాలు మందగించాయి. దీంతో కేడర్‌లో ఒకరకమైన నిరాశ అలుముకుంది. పార్టీకి దిశ నిర్దేశం చేసేవారు కరువయ్యారన్న ఆవేదన వ్యక్తమవుతోంది.

టీడీపీకి బలమైన నియోజకవర్గం..

టీడీపీ ఆవిర్భావం నుంచి ఎచ్చెర్ల నియోజకవర్గం ఆ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చింది. పదిసార్లకుగాను ఆరుసార్లు ఆ పార్టీ విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో టీడీపీతో పొత్తుతో బీజేపీ విజయం సాధించింది. ఎన్టీఆర్ పిలుపు మేరకు టీడీపీలో చేరిన ప్రతిభాభారతి 1983 ఎన్నికల్లో తొలిసారి పోటీచేసి విజయం సాధించారు. 1999 వరకూ ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి గెలుస్తూనే ఉన్నారు. 2004, 2009 ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ గెలిచింది. 2014లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన కళా వెంకటరావు గెలిచారు. 2019లో వైసీపీ, 2024 ఎన్నికల్లో టీడీపీ సహకారంతో బీజేపీ గెలిచింది. సంస్థాగతంగా టీడీపీ బలంగా ఉన్న నియోజకవర్గం ఇది.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల, రణస్థలం, జి.సిగడాం, లావేరు మండలాలు ఉన్నాయి. నాలుగు మండలాలు టీడీపీకి పట్టున్నవే. తాజా ఎన్నికల్లో ఇదే నియోజకవర్గానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడు ఎంపీ కావడం పార్టీకి కలిసొచ్చే అంశం. ఆయనకు నియోజకవర్గ పగ్గాలు అందిస్తే ఎలా ఉంటుందని అధిష్ఠానం ఆలోచన చేస్తోంది. అయితే విజయనగరం జిల్లాలో మిగతా ఆరు నియోజకవర్గాలను ఆయన సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. అందుకే హైకమాండ్ పునరాలోచనలో పడినట్టు సమాచారం. మరోవైపు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఆమె భర్త నారాయణమూర్తి సైతం ఉన్నారు. వీరితో పాటు లావేరు మాజీఎంపీపీ ముప్పిడి సురేష్ సైతం నియోజకవర్గ ఇన్‌చార్జి రేసులో ఉన్నారు. గతంలో కళా వెంకటరావు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, మంత్రిగా వ్యవహరించినప్పుడు సురేష్ అన్నీతానై వ్యవహరించారు. పార్టీ బాధ్యతలు చూసుకునేవారు. ఆయనపై పార్టీ కేడర్‌లో కూడా సానుకూలత కనిపిస్తోంది. మరోవైపు రణస్థలం మండలానికి చెందిన డీజీఎం ఆనందరావు ఉన్నారు. ఆయన బలహీనవర్గాలకు చెందిన వ్యక్తి. అయితే హైకమాండ్ వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.

ఆ రెండు పార్టీలకూ నాయకత్వాలు..

ఈ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యే కావడంతో ఆ పార్టీకి కలిసొచ్చే అంశం. పైగా ఎన్నికలకు ముందు వైసీపీ మెజార్టీ కేడర్ బీజేపీలోకి వచ్చింది. పార్టీకి చెందిన ఎమ్మెల్యే కావడంతో కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. జనసేనపరంగా కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా ప్రారంభమైంది. ఆ పార్టీకి నియోజకవర్గ బాధ్యులు, కార్యవర్గ సభ్యులు ఉండడంతో జనసేన కార్యక్రమాలు సైతం జరుగుతున్నాయి. ఎటొచ్చి టీడీపీ నుంచి ఆశించిన స్థాయిలో కార్యక్రమాలు లేవు. ఇప్పటికైనా టీడీపీ అధిష్ఠానం, జిల్లా నాయకత్వం ఎచ్చెర్ల నియోజకవర్గ పార్టీ బాధ్యతల విషయంలో ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరముంది.

రోడ్లూ లేవు.. కాలువలూ లేవు

- తాగునీరు దొరకదు
- విద్యుత్ సదుపాయం కల్పించలేదు
- లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు
- ఇదీ జగనన్న కాలనీ దుస్థితి



జగనన్న గృహాలకు రోడ్లు లేని దృశ్యం

(పాతపట్నం)

పేదల సొంతింటి కలే ధ్యేయమని గత వైసీపీ సర్కారు గొప్పలు చెప్పింది. జగనన్న ఇళ్ల పేరిట పలువురికి పట్టాలు ఇచ్చింది. అయితే, ఈ కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో మాత్రం విఫలమైంది. రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతపట్నం జగనన్న కాలనీలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పాతపట్నం ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల, బీఆర్ అంబేద్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల ఎదురుగా, స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక భాగంలో మొత్తం మూడు ప్రాంతాల్లో సుమారు 250 మందికి జగనన్న ఇంటి స్థలాల కోసం పట్టాలు ఇచ్చారు. అయితే, ఇప్పటి వరకు కేవలం 30 గృహ నిర్మాణాలే పూర్తయ్యాయి. ఊరికి దూరంగా కొండకు ఆనుకొని పట్టాలు ఇవ్వడంతో నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకురావడం లేదు. అక్కడకు గృహ నిర్మాణ సామగ్రి తరలించేందుకు వ్యయ భారం భారీగా పెరగడం కూడా దీనికి ఒక కారణం. కొందరు కష్టనష్టాలను అధిగమిస్తూ ఇళ్లు కట్టుకున్నారు. అయితే, ఈ గృహాలకు రహదారి సౌకర్యం లేదు. వాహనాల ద్వారా ఇంటికి చేరేందుకు కూడా సరైన మార్గం లేదు. కాలువలు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు లేవు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగు నిలిచిపోతుంది. సుదూరం వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. కాలనీల్లో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసి వాటికి దీపాలు అమర్చారు. ఇవి పగలూ రాత్రీ తేడాలేకుండా వెలుగుతున్నాయి. గృహాలకు మాత్రం విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. ఇదేంటని అడిగితే పాలసీ మేటరంటూ విద్యుత్ శాఖ అధికారులు కారణాలు చెప్పుకొంటూ వచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు గానీ, అప్పటి పాలకులుగానీ చొరవచూపలేదు.



అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు

అప్పుల ఊబిలో లబ్ధిదారులు...

జగనన్న గృహాల లబ్ధిదారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఇళ్ల నిర్మాణానికి గత సర్కారు రూ.1.80లక్షలు దశల వారీగా చెల్లించింది. ఈ బిల్లులు కూడా చాలా మందికి అందలేదు. కనీసం పునాదులు వేసేందుకు కూడా ఆ డబ్బులు సరిపోలేదని, గృహ నిర్మాణానికి కనీసం రూ.10 లక్షల నుంచి రూ.12లక్షల వరకూ వ్యయం జరిగిందని లబ్ధిదారులు చెబుతున్నారు. వైసీపీ పాలనలో ఇసుక, ఇటుక, సిమెంట్, స్టీల్, తదితర గృహ నిర్మాణ సామగ్రి ధరలు ఆకాశాన్ని అంటడమే దీనికి ప్రధాన కారణమని అంటున్నారు. పలువురు లబ్ధిదారులు అప్పు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు అప్పు తీర్చేందుకు గృహాల అమ్మకానికి సిద్ధపడుతున్నారు. కాగా, ఎన్నికలకు ముందు గృహ నిర్మాణాలు పూర్తిచేయాలని, లేదంటే పట్టాలను వెనుకకు తీసుకుంటామంటూ అధికారులు, వైసీపీ నాయకులు లబ్ధిదారులను బెదిరించారు. దీంతో కొందరు అప్పు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇసుక అక్రమంగా తరలిపోకుండా కమిటీలు

- పైడిభీమవరం వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, జూలై 27: ఇసుక అక్రమంగా తరలిపోకుండా జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఇసుక ధర నిర్ణయంపై ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు మండలాల్లో తహసీల్దార్ల అధ్యక్షతన భూగర్భ గనుల శాఖ, ఎంపీడీవోలు, పోలీసు, సెబ్‌లతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు వాహనాలకు అనుమతి ఉంటుంది. వెయిటింగ్ చార్జీలు లేకుండా రవాణా ధర నిర్ణయించాలి. రోజుకు 100 ట్రాక్టర్లు ఇసుక సరఫరా చేయాలి. నాటుబండ్లతో తరలించి నిల్వచేసిన ఇసుకను లారీలతో తరలిస్తే సీజ్ చేస్తాం. స్థానిక అవసరాలకు పంచాయతీ కార్యదర్శి ద్వారా నాటుబండ్లతో ఇసుక తీసుకోవచ్చు. అంతర్ జిల్లా సరిహద్దు పైడిభీమవరం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలి. ఇక్కడ రెవెన్యూ, పోలీసు, సెబ్ అధికారులు అందుబాటులో ఉండాలి. బిల్లులకు క్యూఆర్ కోడ్ ఉంటుంది.' అని కలెక్టర్ తెలిపారు. ఒడిశా నుంచి విశాఖపట్నానికి శ్రీకాకుళం మీదుగా ఇసుక రవాణా జరుగుతుందని సెబ్ ఏఎస్పీ గంగాధరం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వివరించారు. ఈ సమావేశంలో భూగర్భ గనుల శాఖ డీడీ సత్యనారాయణ, డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, భూగర్భగనుల శాఖ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి, ఉప కలెక్టర్ అప్పారావు, టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీవో సుదర్శనదొర, విజిలెన్స్ వేంకటేశ్వరరావు, డీపీవో వేంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

యువత ఉపాధి కోసం సమగ్ర ప్రణాళిక..

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా నైపుణ్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్‌పై చర్చించేందుకు కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని, పరిశ్రమలు, ఉపాధి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి కోసం తరచుగా జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. గ్రాడ్యుయేషన్‌తో పాటు, ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్, మోటారు మెకానిక్, ప్లంబర్లు, మేసన్‌లు, కార్పెంటర్‌లు, కుట్లు, అల్లికలు వంటి వివిధ ట్రేడ్లలో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి, ఉద్యోగ నియామకాలకు అనువుగా యువతను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయా శాఖల అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పీబీ సాయిశ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, పరిశ్రమల అధికారి జె.ఉమామహేశ్వరరావు, సీడాప్ జేడీఎం ఎస్వీ రమణమూర్తి, ఎల్డీఎం సూర్యకిరణ్, డీఎస్డీవో శ్రీధర్, సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అందక.. సీటీ స్కాన్ పనిచేయక

- టెక్కలి ఆస్పత్రిలో రోగుల ఇబ్బందులు
- 160 కేవీ జనరేటర్ మంజూరైనా ఏర్పాటులో జాప్యం



(టెక్కలి)

టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో విద్యుత్ సక్రమంగా అందక సీటీ స్కాన్ యంత్రం సరిగా పనిచేయడం లేదు. సీటీ స్కాన్‌కు అవసరమైన 120 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. మరోపక్క 160కేవీ జనరేటర్ మంజూరైనా దాన్ని ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో సీటీస్కాన్ కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. టెక్కలి జిల్లా ఆస్పత్రికి ఇచ్ఛాపురం, టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, మెళియాపుట్టి, కొత్తూరు, సారవకోట, పాతపట్నం, కోటబొమ్మాళి తదితర ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. ప్రతిరోజూ ఔట్ పేషెంట్ (ఓపీ) విభాగంలో 800 పైబడి పేర్లు నమోదవుతాయి. ఇన్ పేషెంట్స్, ఆరోగ్యశ్రీ కింద మరికొంత మంది చికిత్స పొందుతుంటారు. రోగుల కోసం ఈ ఆస్పత్రిలో రూ.4కోట్ల విలువైన సీటీస్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. రోజుకు 30 నుంచి 40మంది వరకు సీటీస్కాన్ సేవలు పొందుతున్నారు. అయితే, ఈ మిషన్ సక్రమంగా పని చేయాలంటే 120కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అవసరం. కానీ, ఆస్పత్రిలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీంతో విద్యుత్ హెచ్చుతగ్గులతో సీటీస్కాన్ కనీసం రోజుకి నాలుగైదు సార్లు మొరాయిస్తుంది. మళ్లీ పని చేసేందుకు కనీసం అరగంట సమయం పడుతుంది. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో 160కేవీ జనరేటర్ ఉంది. విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో ఆసుపత్రిలో ఇతర అవసరాలకు, సీటీస్కాన్ రన్నింగ్‌కు ఈ జనరేటర్ సరిపోవడం లేదు. పాత జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సీటీస్కాన్ యంత్రానికి సంబంధించి ప్రత్యేకంగా 160కేవీ జనరేటర్ ఉండేది. అయితే నాలుగేళ్ల కిందట పాత ఆసుపత్రి నుంచి కొత్త ఆసుపత్రిలోకి అన్ని విభాగాలు మార్చడంతో సీటీస్కాన్ యంత్రాన్ని కూడా ఇక్కడకు తీసుకువచ్చారు. కానీ, 160కేవీ జనరేటర్‌ను మాత్రం అక్కడే వదిలేశారు. ఇక్కడకు 160కేవీ జనరేటర్ కొత్తగా మంజూరైనా దాన్ని అమర్చేందుకు సంబంధిత ఇంజనీర్లకు ఖాళీలేక రాకపోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 863 మంది ప్రవేశం

- ముగిసిన తొలివిడత కౌన్సెలింగ్
- విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత



సీటు పొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న క్యాంపస్ డైరెక్టర్ బాలాజీ

ఎచ్చెర్ల, జూలై 27: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ ఆఫ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పీయూసీ-1 ప్రవేశాలకు నిర్వహించిన తొలివిడత కౌన్సెలింగ్ శనివారం ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన కౌన్సెలింగ్‌కు మొత్తం 1,035 మందిని పిలవగా 863 మంది హాజరై ప్రవేశాలు పొందారు. 172 మంది గైర్హాజరయ్యారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఇక్కడి క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ ధృవీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ పి.గోవర్ధన్‌రావు, కో.కోఆర్డినేటర్ కె.రమణ, పీఆర్వో మామిడి షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

3న రెండో విడత మెరిట్ జాబితా..

ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఆర్‌కే వ్యాలీ (ఇడుపులపాయ)లోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో మొత్తం 4,140 మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించగా.. ఇందులో 3,396 మంది ప్రవేశాలు పొందారని ఆర్జీయూకేటీ అడ్మిషన్ కన్వీనర్ డాక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు క్యాంపస్‌ల్లో 1035 వంతున విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలిచినట్లు చెప్పారు. ఆర్‌కే వ్యాలీలో 858, నూజివీడులో 883, శ్రీకాకుళంలో 863, ఒంగోలులో 792 మంది ప్రవేశాలు పొందారని తెలిపారు. నాలుగు క్యాంపస్‌ల్లో 744 సీట్లు మిగిలాయన్నారు. ఇందులో జనరల్ 736, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్‌లో 1, కేప్ (సీఏపీ) కేటగిరీలో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల రెండో విడత మెరిట్ జాబితా వివరాలను ఆగస్టు 3న ప్రకటిస్తామన్నారు. తొలి విడత కౌన్సెలింగ్‌లో సీటు పొందిన విద్యార్థులు క్యాంపస్ మార్పు కావాలనుకుంటే డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్జీయూకేటీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఇచ్చిన లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే తొలి విడత జాబితాలో పేరు ఉండి కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్ కోసం వెబ్‌సైట్ లింక్ ద్వారా అప్లయ్ చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ లింక్ ఈ నెల 27నుంచి 30వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఆగస్టు 19, 20 తేదీల్లో వారికి కేటాయించిన క్యాంపస్‌ల్లో తరగతులకు హాజరుకావాలన్నారు. మొదటి విడతలో ఎంపికకాని విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్ కోసం మరోసారి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

నేటి నుంచి డిపార్టుమెంట్ పరీక్షలు


- మూడు కేంద్రాల్లో రాయనున్న 1,715 మంది అభ్యర్థులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: డీఆర్వో

కలెక్టరేట్, జూలై 27: జిల్లాలో ఆదివారం నుంచి ఆగస్టు 2 వరకు జరగనున్న డిపార్టుమెంట్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులు సమీక్ష నిర్వహించారు. జిల్లాలో శ్రీ శివాని ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం), శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట) కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ మూడు కేంద్రాల్లో 1,715 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆబ్జెక్టివ్ తరహా పరీక్ష ఉంటుందన్నారు. అలాగే ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు డిస్క్రిప్టివ్ తరహా పరీక్ష ఉంటుందన్నారు. సంబంధిత అభ్యర్థులు గంటన్నర ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని, ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు గుర్తింపు కార్డులు, సర్వీసు రూల్స్ పుస్తకాలు మాత్రమే తీసుకురావాలని, సెల్‌ఫోన్లు, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.కుమార్‌రాజా, అసిస్టెంట్ సెక్షన్ అధికారి ఎం.శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు


studio green
STUDIO GREEN FILMS (P) LTD.
ALLU SIRISH'S
బడ్డీ
SAM ANTON
IN CINEMAS
AUGUST 2ND


కనిపించేదంతా ముక్కోంటి మర్మమే
1ST AUG
IN THEATRES
శివం భజే
MAHESWARA REDDY MOOLI APSAR


VIJAYA BHASKAR KRAFT
అగస్టు
2
బ్రహ్మాండమైన
విడుదల
SREE KAMAL TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
VIJAYA BHASKAR K
Pre Release Event
ON SUNDAY
28.7.2024


IN THEATRES
AUGUST 2ND
VIJAY ANTONY
తుఫాన్
S.D VIJAY MILTON
ANDHRA PRADESH & NIZAM THEATRICAL RIGHTS CONTROLLED BY: PADMAKAR CINEMAS


DHANUSH
MASSIVE
BLOCKBUSTER
KALANITHI MARAN
PRESENTS
DHANUSH
రాయన్
A R RAHMAN


SVC
అలనాటి
రామచంద్రుడు
IN CINEMAS
AUG 2nd


AUGUST
2ND
IN THEATERS
తిరగబడరసామీ...
MALKAPURAM SHIVAKUMAR
A S RAVIKUMAR CHOWDARY

మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం

- జూనియర్ సివిల్ న్యాయాధికారి మానెం రోషిణి



మాట్లాడుతున్న జూనియర్ న్యాయాధికారి మానెం రోషిణి

పాతపట్నం: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని జూనియర్ సివిల్ న్యాయాధికారి మానెం రోషిణి అన్నారు. స్థానికంగా ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలిసీ తెలియని దశలో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలయ్యే అవకాశాలున్నాయన్నారు. మాదకద్రవ్యాల మహమ్మారి నియంత్రణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. వీటి అమ్మకాలను పూర్తిగా నిషేధించేలా పోలీసు శాఖకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఈ సత్యనారాయణ, న్యాయవాదులు ఎం.రమణ, వై.చంద్రభూషణరావు, సిఐ ఎన్.సాయి, ఎస్ఐ మహమ్మద్ యాశిన్, ప్రిన్సిపాల్ బి.జగన్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు ఛిద్రం

టెక్కలి: మాదక ద్రవ్యాలతో జీవితాలు ఛిద్రమవుతాయని జూనియర్ సివిల్ న్యాయాధికారి తేజా చక్రవర్తి అన్నారు. శనివారం ఓ ప్రైవేటు కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతీ, యువకులు కొందరు మాదక ద్రవ్యాలకు బానిసలై వారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, ఎస్ఐ వెంకటేశ్వరరావు, కళాశాల చైర్మన్ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ మోహనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ న్యాయాధికారి తేజా చక్రవర్తి

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

వజ్రపుకొత్తూరు: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు అన్నారు. శనివారం పూండిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో వివిధ చట్టాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి లైసెన్స్‌లు తప్పనిసరన్నారు. మైనర్లు వాహనాల నడిపితే వారి తల్లిదండ్రులకు, వాహన యజమానులపై చర్యలుంటాయని స్పష్టం చేశారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. చట్టాలు కఠినంగా ఉన్నందున చదువులపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఈశ్వరరావు

క్షణికావేశాలకు లోను కావద్దు

నరసన్నపేట: క్షణికావేశాలకు లోను కావడం వల్ల జీవితం నాశనమవుతుందని మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ అన్నారు. శనివారం స్థానిక సబ్ జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడుతూ.. వైద్య, ఆహార సదుపాయాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. పేదలకు ఉచితంగా న్యాయ సలహాలను న్యాయసేవాధికార సంస్థ అందిస్తుందని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. ఆవేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదని, సహనంగా ఉండాలని సూచించారు. సబ్ జైలు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న న్యాయాధికారి హరిప్రియ

కలెక్టర్, ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే బగ్గు



నరసన్నపేట: ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. తాగు, సాగునీటితో పాటు పట్టణంలో ఎర్రన్నాయుడు చిల్డ్రన్ పార్కు విధ్వంసం చేసిన ఘటనపై కలెక్టర్‌తో చర్చించారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రాజులు చెరువును ఎన్ఆర్ఈజీఎస్‌లో అభివృద్ధి కోరారు. అలాగే ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో శాంతిభద్రతలు, తదితర అంశాలపై చర్చించారు.

సవాళ్లను ఎదుర్కొని ఉత్తమ పౌరులుగా ఎదగాలి

టెక్కలి: సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొని బాధ్యత గల పౌరులుగా సమాజ సేవ చేయాలని విశాఖపట్నం ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరూగాసే అన్నారు. శనివారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్త ఆలోచనలకు పదునుపెట్టి సమాజం గర్వించదగ్గ వ్యక్తులుగా తయారవ్వాలని కోరారు. రెండు దశాబ్దాలుగా గ్రామీణ విద్యార్థుల కు కళాశాల అందిస్తున్న విద్య, ఉపాధి అవకాశాలను కళాశాల కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు వివరించారు. బీటెక్, ఎంబీఏ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వీవీ నాగేశ్వరరావు, డాక్టర్ రవికుమార్, కె.మధుకుమార్, టంకాల నాగేష్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్ డాక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరూగాసే

మూడు రాజధానుల పేరుతో జగన్ మోసం

పోలాకి: మూడు రాజధానుల పేరుతో మాజీ సీఎం జగన్ ప్రజలను మోసం చేశారని టీడీపీ మండల నాయకులు ఎంవీనాయుడు, బైరి భాస్కరరావు, కరుకోల రమేష్‌బాబు, రాంబాబు, పల్లి సూరి బాబు విమర్శించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అమరావతిని రాజధానిగా చేయాలన్న తపనతో చంద్రబాబు నాయుడు రైతులను ఒప్పించారని, అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని విచ్ఛిన్నం చేసి మూడు రాజధానులంటూ నాటకమాడారన్నారు. దీనిని గమనించిన ప్రజలు ఆ పార్టీకి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు ప్రకటించడం శుభపరిణామమన్నారు.

లంపీస్కిన్ నియంత్రణకు టీకా తప్పనిసరి

పిన్నింటి పేట(పోలాకి): వర్షాకాలంలో పాడి పశువులకు సోకే లంపీస్కిన్ వ్యాధి నివారణకు వ్యాక్సిన్ తప్పనిసరని పశువైద్యాధికారి షన్ముఖరావు అన్నారు. శనివారం ప్రియాగ్రహారం, పిన్నింటి పేట, బొడ్డాం, కోడూరు గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ప్రతి ఒక్క పాడిరైతు పశువులకు టీకాలను వేయించాలని సూచించారు.

నేడు ఉజ్జుడి ఉత్సవం

పలాసరూరల్: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రైతులు ఆదివారం ఉజ్జుడి (ఆవేటి వారాలు) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఉబాలు ప్రారంభమవుతాయని, రైతులంతా ఉదయం కాశీగుండం వద్దకు చేరుకొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

పైప్‌లైన్ లీక్‌తో ఇక్కట్లు

హరిపురం: హరిపురం మెయిన్ రోడ్డులో యూనియన్ బ్యాంకు ఎదురుగా ఉద్దానం నీటి పథకం పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతోంది. దీంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పైప్‌లైన్ ద్వారా పెద్దవీధి, కాపువీధి తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. నీరు వదిలే సమయంలో లీకేజీతో రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. పైగా నీరు కలుషితం కావడంతో పాటు, సక్రమంగా కొళాయిల ద్వారా సరఫరా కావడం లేదని పలువురు మహిళలు వాపోతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



హరిపురంలో పైపులైన్ లీక్‌తో రోడ్డుపై పారుతున్న నీరు

చెన్నాయివలసలో తాగునీరు వృథా



జలుమూరు: చెన్నాయివలస గ్రామంలో తాగునీరు వృథాగా పోతోంది. కాలనీ వద్ద నిర్మించిన రక్షిత నీటి పథకం వద్ద కొళాయి నుంచి నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో నీరంతా కాలువల్లోకి పోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డెంగ్యూ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నరసన్నపేట: డెంగ్యూ వ్యాధి విజృంభించకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని ఈవో చిన్నారావు సూచించారు. శనివారం మారుతీనగర్‌లోని ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న నీటి కుంటల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేశారు. నీటి నిల్వ ప్రదేశాల్లో దోమలు ఉత్పత్తి చెంది డెంగ్యూ సోకే అవకాశం ఉందన్నారు. నీటి నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే పట్టణంలో వాటర్ ట్యాంకులలో క్లోరేషన్ చేపట్టారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు నడుంబిగించాలి

నరసన్నపేట: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.శాంతిహేమ అన్నారు. శనివారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. యువత హెల్మెట్ ధరించి ప్రమాదాల బారి నుంచి కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.రవికుమార్, పి.అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

బొడ్డాం(పోలాకి): ప్రభుత్వ విద్యావ్యవస్థకు ఇబ్బందులు కలిగించే జీవో 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యను కాపాడాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్ కుమార్ అన్నారు. శనివారం ఆయన బొడ్డాంలో ఉపాధ్యాయ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను విలీనం చేయడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం జీవో 117ను రద్దు చేసి ఆయా తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఎస్టీయూ, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను తక్షణం పరిష్కరించాలి

టెక్కలి: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ టెక్కలి మండలశాఖ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం ఎంఈవోలు డి.తులసీరావు, ఎం.చిన్నవాడులకు వినతిపత్రం అందజేశారు. జీవో 117ను రద్దుచేసి జీవోఎంఎస్ నెం.53 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలల్లోనే ఐదో తరగతి వరకు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు దాలయ్య, ధర్మారావు, వైకుంఠరావు, నారాయణరావు, విజయ్‌కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యం కావాలి

పలాస: పారిశుధ్య నిర్వహణ, దోమల నియంత్రణలో మహిళలు చైతన్యం కావాలని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్ కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయం మెప్మా విభాగంలో మహిళా సంఘాల ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పి.మోహనరావు, స్వప్న, బి.రాము, రమేష్. పలు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయకండి

పలాస: ప్రతి ఒక్కరు తమ ఇళ్ల వద్ద ఇంకుడు గోతులను తవ్వి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి కోరారు. జలశక్తి అభియాన్‌లో భాగంగా శనివారం విద్యార్థులతో ఇంకుడు గోతులను తవ్వించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీరు సకల కోటికి జీవనాధారమని, దాన్ని భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మధు, శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

రోగులకు బెల్ట్‌లు పంపిణీ

మెళియాపుట్టి: వివిధ నొప్పులతో బాధపడుతున్న రోగులకు బెల్ట్‌లను ఉచితంగా పంపిణీ చేసినట్లు చాపర పీహెచ్‌సీ వైద్యాధికారి అనంతలక్ష్మి తెలిపారు. శనివారం 70 మందికి నడుం నొప్పికి, 15 మందికి మెడకు సంబంధించి బెల్ట్‌లు అందజేసినట్లు పేర్కొన్నారు.

మంత్రి లోకేశ్ ప్రకటన హర్షణీయం

పాతపట్నం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వర్తిస్తుందని మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమని పాతపట్నం నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు అన్నారు. స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు శంకర నారాయణ మాట్లాడుతూ.. ఈ పథకాన్ని ఎందరు పిల్లలున్నా వర్తిస్తుందని పేర్కొనడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించేలా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, మంత్రికి, ఎమ్మెల్యే గోవిందరావులకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ పాఠశాలల ప్రతినిధులు గంగాధర్, విజయ్ కుమార్, కోటి, రవి, ఈశ్వర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలాస రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన జీఎం

పలాస, జూలై 27: పలాస రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈస్ట్‌కోస్ట్ రైల్వే (భువనేశ్వర్) జనరల్ మేనేజర్ నరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం సాయంత్రం పరిశీలించారు. అమృత్ భారత్‌లో భాగంగా గత ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.24 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈనిధులతో స్టేషన్, ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం అభివృద్ధి, ప్రయాణికులు, సిబ్బంది విశ్రాంతి గదులు, కార్యాలయాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. పనులు ఆ ప్రస్తుతం జరుగుతున్న నేపథ్యంలో జీఎం పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రత్యేక రైలులో వచ్చిన ఆయన నేరుగా ప్లాట్ ఫారాన్ని పరిశీలించారు. స్టేషన్ మేనేజర్ కార్యాలయం, టికెట్ కౌంటర్లను పరిశీలించారు. ప్రయాణి కులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్ఎం హర్యజన్‌సింగ్ భజ్వా, ఇతర రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పలాస రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న జనరల్ మేనేజర్ నరమేశ్వర్ ఫంక్వాల్

శ్యామసుందర స్వామి ఆలయ స్థలంలో అక్రమ నిర్మాణం

- చోద్యం చూస్తున్న దేవాలయ అధికారులు

టెక్కలి, జూలై 27: పట్టణంలోని శ్యామసుందరస్వామి ఆలయానికి సంబంధించి రూ.లక్షలాది విలువ చేసే స్థలం ఆక్రమణకు గురై నిర్మాణం చేపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సర్వే నెం.540/2-3లో గుట్టు చప్పుడు కాకుండా నిర్మాణం పూర్తి చేసినా అధికారులు స్పందించడం లేదు. దేవ స్థానం భూముల ఆక్రమణదారులు శిక్షార్హులని బోర్డులు పెట్టి నా ఆక్రమణదారులు పట్టించుకోలేదు. ఈ ఆలయానికి సం బంధించి ఇప్పటికే కోట్ల రూపాయల స్థలాలు ఆక్రమణకు గురికాగా, తాజాగా మరో అక్రమ నిర్మాణం వెలుగులోకి వచ్చింది. ఎన్నికల వేళ అధికారులు బిజీగా ఉన్న సమయంలో ఈ భవన నిర్మాణం దశల వారీగా పూర్తిచేశారు. శ్యామ సుందర స్వామి ఆలయానికి సంబంధించిన స్థలాల్లో పలు అక్రమ నిర్మాణాలు చేసి కొందరు నామ మాత్రపు అద్దె చెల్లిస్తుండడం, మరి కొందరు కోర్టులను ఆశ్రయించిన ఘటనలు జరుగుతున్నాయి. ఈ విషయమై ఆలయ అర్చకుడు పద్మనాభ పండా వద్ద ప్రస్తావించగా అక్రమ నిర్మాణం తన దృష్టికి రాలేదని, వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.



ఆలయ స్థలంలో నిర్మాణం

ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

మెళియాపుట్టి: ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు అన్నారు. శనివారం సీపీఎం బృందం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసు కున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా నిర్వాసితుల సమ స్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకుని నిర్వాసితులకు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని గోవిందరావు హెచ్చరించారు.



పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

నేడు ఐటీఐ రెండోవిడత కౌన్సెలింగ్

పలాస: పలాస కణితీస్ ఐటీఐలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులకు రెండో విడత కౌన్సిలింగ్ ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైల జవహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఐటీఐకి హాజరుకావాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి సాయం

సంతబొమ్మాళి: అనారోగ్యంతో మృతి చెందిన ఆకాశ లక్కువరం డీలర్ కె.సింహాచలం కుటుంబానికి తోటి డీలర్లు ఆర్థిక సాయాన్ని అందించారు. నిరుపేద అయిన సింహాచలం కుటుంబానికి జిల్లాలోని డీలర్లంతా కలిసి రూ. 62,300 నగదును ఆయన కుటుంబానికి శనివారం అందించారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి మండల డీలర్ల సంఘ అధ్యక్షుడు ఆరంగి రామారావు, కొండాల చిట్టయ్య పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

జలుమూరు, (సారవకోట): రైతులు అభ్యున్నతే ఉమ్మడి కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. గుమ్మపాడు రైతు సేవా కేంద్రంలో యూరియా ఎరువులను శనివారం పంపిణీ చేశారు.

మొక్కలు నాటి..

జిల్లాలోని పలు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్‌లో భాగంగా శనివారం మొక్కలను నాటి వాటి ఆవశ్యకతను విద్యార్థులకు ఎంఈవోలు, ఉపాధ్యాయులు వివరించారు. అలాగే డిగ్రీ కళాశాలలు, పాఠశాలల్లో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మొక్కలను నాటారు.
-ఆంధ్రజ్యోతి బృందం



హరిపురం: పొత్తంగి-సిరిపురంలో మదర్ గార్డెన్‌లో విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు



నందిగాం: పెద్దతామరాపల్లిలో మొక్కలను నాటుతున్న ఉపాధ్యాయులు





హిరమండలం: అవలంగి, జలుమూరు: తిమడాంలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు



సోంపేట: డిగ్రీ కళాశాలలో మొక్కలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

యువకుడి ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

రణస్థలం: జేఆర్ పురం పంచాయతీ పరిధిలోని సీతంవలస గ్రామానికి చెందిన ధర్మాన రమేష్ (21) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసు కథనం మేరకు కుటుంబ కలహాల మేరకు శనివారం గ్రామానికి సమీపాన ఉన్న ఒక తోటలో ధర్మాన రమేష్ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు ఈ ఘటనను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. రమేష్‌కు తండ్రి, తల్లితోపాటు సోదరుడు ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి, తండ్రి ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లారీ పట్టివేత

శ్రీకాకుళం రూరల్: బట్టేరు నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుండడంతో వీఆర్వోల ప్రత్యేక బృందం ఇసుక లారీని పట్టుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో వీర్వోలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం వేకువ జామున వీఆర్వోల బృందం ఇసుక అక్రమ రవాణా జరిగే ప్రాంతాలను పరిశీలిస్తుండగా బట్టేరు నది నుంచి ఉదయం 6 గంటలకు ఇసుకను విశాఖ తరలిస్తున్న లారీని గుర్తించింది. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడంతో లారీని, రాజాన అర్జున్‌ను పెద్దపాడు పోలీసులకు అప్పగించారు. అలాగే మైన్స్ అధికారులకు నివేదిక అందించారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న వారిలో పొన్నాం వీఆర్వో గణేష్, అలికాం, భైరి వీఆర్వోలు యశ్వంత్, రవితేజ, లక్ష్మణరావు ఉన్నారు.

అనుమానితులు తారసపడితే సమాచారమివ్వండి


టిడ్కో నివాసులతో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైం: అనుమానితులు తారసపడినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని శ్రీకాకుళం సర్కిల్ సీఐ ఎల్.సన్యాసినాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. రూరల్ మండలం పాత్రునివలస గ్రామంలో ఉన్న టిడ్కో నివాస ప్రాంతాల్లో సీఐ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ వాసుదేవరావు తన బృందంతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంట్లో తనిఖీలు చేసి వారి కుటుంబ సభ్యుల వివరాలు, వాహనాల ధ్రువపత్రాలను సీఐ, ఎస్ఐలు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ నాయుడు మాట్లాడుతూ.. టిడ్కో నివాస ప్రాంతాల్లో ఇటీవల కొంత మంది ఆకతాయిలు, అనుమానితులు సంచరిస్తున్నారన్న సమాచారం ఉందని, అటువంటి వారు ఎదురుపడితే 100కి లేదా 63099 90814, 63099 90845 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. నేర నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ పిలుపునిచ్చారు. కార్డెన్ సెర్చ్‌లో ధ్రువపత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను ఎస్ఐ వాసుదేవరావు సీజ్ చేశారు. ఈ సెర్చ్‌లో వన్‌టౌన్ ఎస్ఐ కామేశ్వరరావు, గార వన్‌టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెపటైటీస్-బీ ప్రమాదకర వ్యాధి



అవగాహన ర్యాలీలో నర్సింగ్ విద్యార్థినులు

అరసవల్లి: హెపటైటిస్-బీ ప్రమాదకర వ్యాధి అని, వ్యాక్సినేషన్ ద్వారా దీనిని నివారించవచ్చని రిమ్స్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మిచెల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.పద్మావతి అన్నారు. ప్రపంచ హెపటైటిస్-బీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రిమ్స్ నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెపటైటిస్-బీ వ్యాధిపై "ఇది స్పందించాల్సిన సమయం' అన్న నినాదాలు చేశారు. కాలేయానికి సంబంధించిన ఈ వ్యాధి తీవ్రత, దాని పర్యవసానాలను ప్రజలకు వివరించారు. ఈ అంశంపై డిబేట్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.ఉషా పన్నగవేణి, ఏపీవో పి.సునీత, లెక్చరర్లు, బోధనా సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 100 మంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మొక్కలు నాటుతున్న న్యాయాధికారి, సీఐ

ఇచ్ఛాపురం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని వీటి బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఇచ్ఛాపురం మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.ఫణి కుమార్ అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు ఉపయోగంపై జరిగే నష్టాలను వివరించి అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, తహసీల్దార్ గురుప్రసాద్, డాక్టర్ వాణి, ప్రిన్సిపాల్ రాబిన్ కుమార్ పాడి, న్యాయవాదులు రంగారావు, కృష్ణమూర్తిరెడ్డి లెక్చరర్స్ పాల్గొన్నారు.

రాత్రి గస్తీపై దృష్టిసారించండి

ఆమదాలవలస: సర్కిల్ పరిధిలో రాత్రి గస్తీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని డీఎస్పీ శృతి తెలిపారు. శనివారం ఆమె పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ దివాకర్ యాదవ్, ఎస్ఐ కె.వెంకటేషన్‌కు పలు సూచనలు చేశారు. మహిళలు, యువత, విద్యార్థులను రక్షణపై చేపట్టాల్సిన విధి విధానాలను డీఎస్పీ వివరించారు.

లోకేష్‌ను కలిసిన టీడీపీ నేత 'ఆనెపు'


లోకేష్‌కు సమస్యలు వివరిస్తున్న దృశ్యం

బూర్జ: రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను విజయవాడలో టీడీపీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ ఆనెపు రామకృష్ణం నాయుడు మర్యాద పూర్వకంగా విజయవాడలో శనివారం కలిశారు. బూర్జ మండలంలో ఉన్న పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాగావళి- వంశధార నదుల అనుసంధానం, బొమ్మిక ప్రాజెక్టు, ఓనిగెడ్డ కాలువ ఆధునికీకరణ పనులు, మండలంలో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు, రోడ్ల మరమ్మతులపై వివరించారు.

పుల్లట్ల ప్రవీణ్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న ప్రవీణ్ పుల్లట్ల

అరసవల్లి: ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, రైజ్ సీఈవో ప్రవీణ్ పుల్లట్లకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాజకీయ పరిశోధన, విశ్లేషణ విభాగంలో విశిష్ట సేవలందించినందుకు గాను తమిళనాడులోని హోసూరులో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఈ అవార్డును అందుకున్నారు. ఈ సంస్థ ప్రతీ ఏడాది పలువురు ప్రముఖులను అవార్డులతో సత్కరిస్తుంది. గౌరవ డాక్టరేట్ పొందిన ప్రవీణ్ పుల్లట్ల శ్రీకాకుళం జిల్లా, కవిటి మండలం, బైరిపురం గ్రామానికి చెందిన వ్యక్తి. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కచ్చితత్వంతో కూడిన సర్వే ఫలితాలు అందించాడు. రైజ్ సీఈవో హోదాలో ప్రముఖ మీడియా సంస్థ ఎంపిక చేసిన దేశంలో తొలి 15 షైనింగ్ స్టార్స్ జాబితాలో కూడా ప్రవీణ్ స్థానం సంపాదించారు.

చెరువుల్లా రోడ్లు

- వైసీపీ పాలనలో సిక్కోలు నగరం గుంతలమయం
- కానరాని డ్రైనేజీలతో నగర రోడ్లు
- కూటమి ప్రభుత్వం దృష్టి
- సమీకృత మురుగు నీటి వ్యవస్థతో చెక్ పెట్టేందుకు ప్రణాళికలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ పరిధిలో గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు నోచుకోకపోవడంతో సిక్కోలు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. గత పాలకులు ప్రజల కనీస అవసరాలపై దృష్టి సారించకపోవడం, జనాభా పెరుగుదల, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు జరగకపోవడంతో ఐదేళ్ల పాపం కమిషనర్ మెడకు చుట్టుకుంది. గడిచిన కొద్ది రోజులుగా నగరంలో భారీ వర్షాలు కురవడంతో డ్రైనేజీలు లేక వరద నీరు రోడ్లపై ఏరులైపారుతోంది. ఓ వైపు తుఫాన్, మరో వైపు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు సిక్కోలు నగరాన్ని సుందరంగా.. ఆరోగ్యవంతంగా తీర్చే పనిలో పడ్డారు కమిషనర్. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాటు ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యం దిశగా కమిషనర్ అడుగులు వేస్తున్నారు. దీంతో ప్రతీ రోజూ వీలైనన్ని పంచాయతీలతో సహా ప్రతీ వీధిలో సమస్యలను గుర్తించి వాటికి తాత్కాలిక పరిష్కారం చూపుతూ.. శాశ్వత పరిష్కారం చూపించేలా కమిషనర్ పనులు చేపడుతున్నారు.

ముంపు ప్రాంతంలో పర్యటన

నగరంలోని తోటపాలెం రోడ్డులో మూడు అడుగుల మేర వరదనీరు రోడ్లపై ప్రవహిస్తుందని తెలుసుకున్న కమిషనర్ శనివారం పర్యటించారు. రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీటిని పంట పొలాల్లోకి తరలించే పనులు చేపట్టారు. ఆ రోడ్డులో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. అలాగే నీలమ్మ కాలనీ, పాతబస్టాండ్, రిమ్స్ ఆస్పత్రి ప్రాంతాల్లో కూడా కమిషనర్ పర్యటించారు. అలాగే పాతబస్టాండ్‌లో సమీపంలో ఉన్న పొట్టి శ్రీరాములు మార్కెట్ రోడ్డులో నిల్వ ఉన్న వరద నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. డీసీసీబీ కాలనీ, ఇందిరానగర్ కాలనీ, హౌసింగ్ బోర్డు, టిడ్కో కాలనీల్లో కూడా కమిషనర్ పర్యటించి అక్కడ సమస్యలను గుర్తించి, డ్రైనేజీల నిర్మాణానికి కావాల్సిన నివేదికను అందించాలని సంబంధిత అధికా రులకు సూచించారు.


చెరువును తలపిస్తున్న తోటపాలెం రోడ్డు

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

గడిచిన ఐదేళ్ల పాలనలో డ్రైనేజీల అనుసంధానం జరగకపోవడంతో నగరం మురుగు మయమైంది. ప్రభుత్వం మారడంతో నగర సుందరీకరణానికి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. చిన్న కాలువలు నుంచి పెద్ద కాలువలు వరకు అనుసంధానం చేసి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనులు చేపట్టాం. సమీకృత మురుగు నీటి వ్యవస్థ (డీపీఆర్) ద్వారా డ్రైనేజీల అనుంసంధానం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఈ మేరకు కన్సల్టెన్సీ ఆశ్రయించాం నివేదిక రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. అలాగే భూ గర్భ డ్రైనేజీ వ్యవస్థపై కూడా ఆలోచన చేస్తున్నాం.

- ఓబులేసు, నగర కమిషనర్

బుడగట్లపాలెం హార్బర్ పనులు ప్రారంభించాలి


కలెక్టర్‌ను కలిసిన డీఎఫ్‌వో, ఇతర అధికారులు

కలెక్టరేట్: బుడగట్లపాలెం సముద్రతీరంలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు తిరిగి మొదలుపెట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అటవీశాఖలు సంయుక్తంగా సర్వే చేసి హార్బర్ పనులకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం ఆయన తన చాంబర్‌లో మత్స్యశాఖ అధికారులతో సమావేశమయ్యారు. పనులను ప్రారంభించి ప్రతీ 15 రోజులకు ఒకసారి తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, ఏడీ గోవిందరావు, పలువురు ఫిష్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. అలాగే కలెక్టర్‌ను జిల్లా అటవీశాఖ అధికారి శంబంగి వెంకటేష్‌తో పాటు పార్వతీపురం మన్యం జిల్లా డీఎఫ్‌వో ప్రసూణ, టెక్కలి సబ్ డీఎఫ్‌వో ఏపీ నాగేంద్రరావు, పాలకొండ సబ్ డీఎఫ్‌వో సంజయ్, రేంజర్లు పి.అమ్మన్నాయుడు, జి.జగదీశ్వరరావు, కె.రాజశేఖర్, నిహారిక, సురేష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

● **గుజరాతీపేట:** రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్.. ఒకే పరీక్ష విధానం అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ బృందం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. జిల్లాలోని విద్యారంగ సమస్యలపై కార్యాచరణలో భాగంగా కలెక్టర్‌ను కలిసి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవో నెంబరు 117 రద్దు చేసి, జీవో ఎంఎస్ నెంబరు 53 ప్రకారం టీచర్లను కేటాయించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబురావు, బి.శ్రీరామ్‌మూర్తి, కేదాలయ్య, చౌదరి రవీంద్ర, పి.అప్పారావు, పి.సూర్య ప్రకాశరావు, బి.శంకరరావు, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన వీఆర్వోలు


జేసీని కలిసిన వీఆర్వో సంఘ నాయకులు

కలెక్టరేట్/ నరసన్నపేట: జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను శనివారం తన చాంబర్‌లో జిల్లా విఆర్వోల సంఘం గౌరవపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసారు. జెసిని కలిసిన వారిలో విఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు వంజరాపు.రమేష్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, గౌరవాధ్యక్షుడు ప్రగడ.వేణుగోపాలరావు, తదితరులు ఉన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న రిటైర్డు ఐఏఎస్


కూర్మనాథుని సన్నిధిలో రిటైర్డు ఐఏఎస్ అధికారి రమేష్ దంపతులు

అరసవల్లి/ గార: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శనివారం ఉదయం రిటైర్డు ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికను దేవదాయశాఖ జిల్లా అధికారి ప్రసాదరావు పట్నాయక్ వారికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి, ఇప్పిలి సాందీపశర్మ, రంజిత్ శర్మ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు అర్చకులు స్వాగతం పలికారు. స్వామి వారి ప్రసాదాన్ని చిత్ర పటాన్ని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ప్రసాద పట్నాయక్, ఆలయ ఈవో గురునాథరావు వారికి అందచేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సీతారామ నర్సింహాచార్యులు, నర్సుబాబు, ఇతర అర్చక స్వాములు పాల్గొన్నారు.

అండర్ పాస్, ఓవర్ బ్రిడ్జి నిర్మించండి


జీఎంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న రాజు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వే నిలయం సమీపంలో ఓవర్ బ్రిడ్జ్, అండర్ పాసేజ్ నిర్మించాలని జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు రైల్వే జీఎం పరమేశ్వర్ సన్వాల్‌ను కోరారు. ఈమేరకు శనివారం ఇచ్ఛాపురం రైలు నిలయానికి వచ్చిన జీఎంకు వినతి పత్రాన్ని అందజేశారు. అండర్ పాసేజ్ మరమ్మతులకు గురికావడం వల్ల వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన జీఎం పాడైన అండర్ పాసేజ్‌ను పరిశీలించారు. టీడీపీ సోషల్ మీడియా సాలిన జగదీష్, లక్ష్మణరావు, రమణారావు, మేఘనాథ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పీపీ, ఏపీపీ పోలీసు అధికారులు

గుజరాతీ పేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రిమినల్ చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు శాఖ మరింత అవగాహన పెంచుకుని న్యాయవ్యవస్థ, బాధితులకు తోడ్పాటునందించాలని ఏపీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరి రామకోటేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలోని పీపీలు, కోర్టు పోలీసు లైజనింగ్ అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్య క్రమంలో పీపీలు మెట్ట మల్లేశ్వరరావు, వాన కృష్ణచంద్, తంగి శివ ప్రసాదరావు, కోత తిరుమలరావు, సీహెచ్ శ్రీకాంత్, కె.శంకరరావు, సీహెచ్ సత్యనారాయణ, ఎల్వీ రమణ, పి.ఉషాసింగత్, ఉషారాణి, ఏపీపీలు పి.సుశీల, ఎల్.నాగభూషణరావు, కె.సూర్యకుమార్, ఎల్.రఘునాథ్, ప్రియదర్శిని, ఆర్.శాంతి సంతోషి, జి.విజయలక్ష్మి, డి.హరి ప్రియ, రమేష్, జిల్లా కోర్టు పోలీస్ లైజన్ ఎస్ఐ జి.నాగమణి, ఏఎస్ఐలు తదతరులు పాల్గొన్నారు.

గొండు శంకర్ విజయం.. స్ఫూర్తిదాయకం


ఎమ్మెల్యే గొండు శంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అరసవల్లి: యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ శ్రీకాకుళం అధ్యక్షుడు గొండు శంకర్ విజయం స్ఫూర్తిదాయకమని అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భిక్షమయ్య గురూజీ అన్నారు. విజయవాడలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం గొండు శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. శంకర్ విజయం తమ అసోసియేషన్‌లో కొత్త ఉత్సాహం నింపిందన్నారు. ఈ సందర్భంగా శంకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు రాధిక, భారత స్వాభిమాన్ ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాసులు, కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కార్యాలయ కార్యదర్శి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

శ్రీకాకుళం రూరల్: ప్రతీ ఒక్కరూ ఒక మొక్కను నాటి వాటిని పరిరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోగలమని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ షోయబ్ ఆలమ్ తెలిపారు. వన్ ప్లానిట్ టు మదర్ ఎర్త్ అనే కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యాలయంలో 160 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటారు. గ్లోబల్ పరిరక్షణ అందరి బాధ్యతని ఆ దిశగా ప్రతీ ఒక్కరూ మొక్కలు పెంచడం అలవాటు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

నిరుపేదలకు అన్నదానం


నిరుపేదలకు అన్నదానం చేస్తున్న జనసేన కార్యకర్తలు

రణస్థలం: మండల కేంద్రంలోని నిరుపేదలకు జనసేన కార్యకర్తలు గొర్లె సూర్య, ఎం.అప్పన్న ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని, డొక్కా సీతమ్మ పేరు మీద అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్టు వారు తెలిపారు. కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తూ వచ్చిన లాభాన్ని నిరుపేదల కడుపునింపేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు.

వాహదారులు విధిగా హెల్మెట్ వినియోగించాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి మణి

ఆమదాలవలస: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.మణి అన్నారు. శనివారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. మోటార్ వాహనాల చట్టం విధి విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జగన్, ఏపీపీ సీపాన గోవిందరావు, సీఐ వాయునందన్, దివాకర్‌యాదవ్, ప్రిన్సిపాల్ స్వామి, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, బొడ్డేపల్లి మోహన్‌రావు, హనుమంతు అచ్చెన్నాయుడు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పిన్నింటి రజినిసాయి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట వేస్తానన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం కొలువుతీరి నెల రోజులకే 300 మంది యువతీ, యువకులకు వివిధ పరిశ్రమల్లో ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. తోటపల్లి నీరు వారం రోజుల్లో ఈ ప్రాంతానికి వస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్, జడ్పీటీసీ టొంపల సీతారాముడు, వైస్‌ఎంపీపీ బుజ్జి, ఎంపీడీవో వెంకటరమణ, ఏడీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం వెనుక కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే ఎన్ఈఆర్ స్థల పరిశీలన చేశారు.

మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం

శ్రీకాకుళం క్రైం: మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్ అన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే శిక్ష తప్పదని, లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని విద్యార్థులకు ఏఎస్పీ సూచించారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం వల్ల క్రిమినల్ కేసులు తప్పవన్నారు. డ్రగ్స్, ర్యాగింగ్, బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం, ఎస్ఐలు సుధాకర్, సందీప్‌కుమార్, జూనియర్ కళాశాల (మెన్స్) ప్రిన్సిపాల్ పి.దుర్గారావు, గర్ల్స్ జూ.క.ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

లావేరు: జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో లావేరు మండలం పెదకొత్తపల్లికి చెందిన కాకర్ల బాబాజీ ఆధ్వర్యంలో చురుగ్గా సాగుతుంది. ఈ నెల 18 నుంచి 27 తేదీ వరకు సుమారు 500కు పైగా సభ్యత్వ నమోదు చేయించి.. ఆ పార్టీ అధిష్ఠానం వద్ద గుర్తింపు పొందారు. బాబాజీని నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వక్షేన్ అభినందించారు.

రిమ్స్ పరిసరాలు పరిశీలన

అరసవల్లి: నగర మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్) పరిసరాలను శనివారం తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. రిమ్స్‌లో పారిశుధ్య నిర్వహణ, చెత్తను వేసే డంపింగ్ యార్డు, మార్చురీ పరిసరాలు, ఎస్‌టీపీ ప్లాంట్ తదితరాలను పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించిన చెత్తను ఎక్కడికక్కడా అడ్డంగా వేయడం గమనించి, వాటిని తీసివేయాలని ఆదేశించారు. బయో మెడికల్ చెత్తను ఎలా మేనేజ్ చేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

నగర సుందరీకరణకు సహకరించండి

శ్రీకాకుళం క్రైం: సిక్కోలు నగర సుందరీకరణకు అందరు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ప్రజలను కోరారు. ఈ మేరకు శనివారం సినిమా థియేటర్ మేనేజర్లతో కమిషనర్ తన కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో రోడ్లుకి ఇరువైపులా ప్రభుత్వ, ప్రైవేట్ కాంపౌండ్ గోడలపై, ట్రాన్స్‌ఫార్మర్లు, డివైడర్లు, విద్యుత్ స్తంభాలపై పలు వాణిజ్య విద్యా సంస్థలు, సినిమా థియేటర్ల ప్రకటనలు, పోస్టర్లు అతికిస్తున్నారని ఏపీఎంసీ యాక్ట్ ప్రకారం ఇది నేరమని తెలిపారు. ఇకపై ఇలా ప్రకటనలు అతికిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్లు, రాజు, ప్రసాద్, రవి, నాగభూషణం, టీపీవో ఉమ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీసీటీవీ ఇన్‌స్టలేషన్‌పై శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 29వ తేదీ నుంచి సీసీటీవీ, ఇన్‌స్టలేషన్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18-45 ఏళ్ల లోపు ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ పొందిన వారికి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వారిచే సర్టిఫికేట్ అందజేయడంతో పాటు సొంతంగా యూనిట్ స్థాపనకు బ్యాంకు నుంచి రుణాలు మంజూరు చేస్తామన్నారు. మిగతా వివరాలకు 79933 40407, 95534 10809కు సంప్రదించాలన్నారు.

31న డీసీసీపీలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో డిప్లమో ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ (డీసీసీపీ)లో స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు.

జెమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స


కణితి తొలగించిన జెమ్స్ వైద్యులు

శ్రీకాకుళం రూరల్: రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో శనివారం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి ఓ మహిళ కడుపులో నుంచి 40 సెం.మీ కణితిని వైద్యులు తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. నరసన్నపేటకు చెందిన 50 ఏళ్ల నాగమ్మ గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడు తుంది. దీంతో ఆమె జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందేందు కు వెళ్లగా కేన్సర్ స్పెషలిస్ట్ బమ్మిడి సందీప్ నాగమ్మకు పరీక్షలు నిర్వహించగా కడుపులో 40 సెం.మీ కణితి ఉన్నట్టు గుర్తించారు. అయితే కణితి తొలగించే క్రమంలో చిన్న రంధ్రం పడిన తొలి దశలో ఉన్న కేన్సర్ కణాలు వృద్ధి చెంది మూడో దశకు చేరుకునే ప్రమాదం ఉందని వైద్యులు గుర్తించారు. ఈ క్రమంలో ఆరు గంటల పాటు శ్రమించి వైద్యులు కణితిని తొలగించారు. ఆపరేషన్ అనంతరం రెండు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉన్న నాగమ్మ ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఆమెను శనివారం డిశ్చార్జ్ చేశారు. కణితి తొలగించి తనకి పునర్ జన్మనిచ్చిన వైద్యులకు నాగమ్మ అతని కుటుంబ సభ్యులు జెమ్స్ యాజమాన్యానికి, వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శస్త్ర చికిత్స చేసిన వారిలో జనరల్ సర్జన్ శశి, ఎనస్తీషియో వైద్యులు శ్రీజ, తదితరులు ఉన్నారు.

అయ్యప్ప కుటుంబానికి పరామర్శ

లావేరు: చినమురపాక గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిరిపురపు అయ్యప్పలనాయుడు ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. శనివారం చినమురపాకలోని ఆయన కుటుంబ సభ్యులను పలువురు నాయకులు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆర్.ప్రకాశరావు, ఎంపీటీసీలు జగ్గురోతు తవిటినాయుడు, జె.భానోజీరావు, ఐ.సతీష్, డి.శివ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం

ఇచ్ఛాపురం: లొద్దపుట్టి గ్రామానికి చెందిన రోకళ్ల మోహన్‌రావు ఇటీవలే అనరోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబానికి శనివారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజుతోపాటు జనసైనికులు పరామర్శించారు. అనంతరం మృతునికి భార్య రాధ, కుమార్తె పేరున రూ.54వేలు పోస్టల్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను గాంధీవీధికి చెందిన జనసైనికులు అందించారు. జనసైనికులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హరినామ సంకీర్తన

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కలెక్టర్ బంగ్లా దరి పవిత్ర నాగావళి నదీ తీరాన వెలసియున్న కల్యాణ వేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి సేవకులచే నగర వీధుల్లో హరినామ సంకీర్తనలు నిర్వహించారు. అర్చకులు బూరాడ వంశీ స్వామి వారిచే శ్రీవారు, అమ్మవార్లకు విశేష అలంకరణ జరిగింది. 12 గంటల నుంచి అన్న ప్రసాద వితరణ శ్రీవారికి ప్రీతికరమైన నక్షత్ర కుంభ, నేయి, కర్పూర, నవనీత పంచహారతుల పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు సాయం

పొందూరు: తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు అమెరికాకు చెందిన తెలుగు ఎన్ఆర్ఐ దంపతులు రామ్ మైనేని, సుస్మా మైనేని ఆర్థిక సాయం అందించారు. ఏటా ఉత్తమ ప్రతిభ చూసిన విద్యార్థులకు వారు ఆర్థిక సాయం చేస్తుంటారు. ఈ క్రమంలో ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కూన రేవతి, మెట్ట లక్ష్మిలకు రూ.10 వేలు చొప్పున పాఠశాల హెచ్ఎం బి.కంఠయ్య, ఉపాధ్యాయులు శనివారం అందించారు.